manachourasta
# మన చౌరాస్తా
The Complete News way

మన చౌరాస్తా Telugu News Channel

సంపుటి : 01 | సంచిక : 241 | బుధవారం | 12.03.2025



# 'అమ్మ'య్యా!

## తల్లిదండ్రుల చెంతకు శివాని

### చిన్నారి కిడ్నాప్ కథ సుఖాంతం

### 13 రోజుల్లోనే కేసును ఛేదించిన పోలీసులు

### అభినందించిన ఏసీపీ పండరి చేతన్ నితిన్



**మన చౌరాస్తా, జనగామ ప్రతినిధి :**

'అమ్మ'య్యా.. జనగామ జిల్లా కేంద్రంలో ఇటీవల కిడ్నాప్ కు గురైన 10 నెలల పసిపాప శివాని కథ సుఖాంతమైంది. జనగామ పోలీసులు తమదైన శైలిలో కేసును ఛేదించి పాపను తల్లిదండ్రులకు అప్పగించారు. దీంతో ఆ కుటుంబంలో సంతోషం నిడింది. ఈ కేసుకు సంబంధించిన వివరాలను జనగామ ఏసీపీ పండరి చేతన్ నితిన్ మంగళవారం జనగామ పోలీస్ స్టేషన్‌లో మీడియాకు వెల్లడించారు.

చత్తీసగఢ్ రాష్ట్రానికి చెందిన చెందిన పార్వతి, రామ్‌జుల్ రాజాక్ దంపతులు కొన్ని రోజుల కింద బతుకు దెరువు కోసం జనగామకు వలస వచ్చారు. పట్టణంలో కూలి పని చేసి జీవనం సాగిస్తున్నా వీరికి నలుగురు సంతానం. అయితే 13 రోజుల కింద రామ్ జిల్ రాజాక్ చిన్న కూతురు శివాని (10 నెలల) కిడ్నాప్‌కు గురైంది. తమ పాపను తమతో పనిచేస్తున్న విజయలక్ష్మి, స్వామి రాజ్ కిడ్నాప్ చేశారని వారు ఆరోపించారు. ఈ మేరకు జనగామ పోలీసులకు ఫిర్యారు చేశారు.

## శ్రమించిన పోలీసులు..

కిడ్నాప్ కేసు నమోదు చేసుకున్న పోలీసులు పాప ఆచూకీ కోసం దర్యాప్తు ప్రారంభించారు. అయితే కిడ్నాపర్లకు సంబంధించి పేరు మినహా ఎలాంటి ఆధారాలు లేవు. అది కూడా సరైందా కాదా అనే ప్రశ్నలు మరోవైపు.. కానీ పోలీసు తమదైన వ్యూహంతో ముందుకు సాగారు. సీసీ కెమెరాల ఆధారంగా నిందితుల కోసం గాలింపు చే పట్టారు. నిందితుల నడవడిని గుర్తించి పట్టుకున్నారు. విజయవాడకు చెందిన చంద్రమ్మ అనే మహిళతో కలిసి పిల్లలు లేని వారికి పాపను అమ్మాలనే ఆలోచనతో పంతంగి సురేశ్, పెంద్ర తిరుపతమ్మ, గరికముక్కు విజయలక్ష్మితో కలిసి పథకం ప్రకారం పాపను కిడ్నాప్ చేశారని గుర్తించారు. సోమవారం హైదరాబాద్ జాతీయ రహదారి పెంబర్తి వద్ద పోలీసులు వాహన తనిఖీ చేస్తుండగా నిందితులు పోలీసులకు చిక్కారు. గతంలోనూ వీరిపై పలు పోలీసు స్టేషన్లలో కేసులు ఉన్నాయని ఏసీపీ పండరి చేతన్ నితిన్ తెలిపారు. కిడ్నాప్ కేసును తక్కువ సమయంలో ఛేదించిన జనగామ సీఐ దామోదర్‌రెడ్డి, ఎస్సై చెన్నకేశవ, కానిస్టేబుళ్లు కరుణాకర్, మహేందర్, అరవింద్, ఏఏవో సన్మాన్ను ఏసీపీ అభినందించి రివార్డులు అందజేశారు.

## పోలీసులకు ధన్యవాదాలు..

గత 13 రోజులుగా తమ పాప శివాని కనిపించకపోవడంతో తల్లిదండ్రులు పార్వతి, రామ్‌జుల్ రాజాక్ అల్లాడిపోయి కన్నీరుమున్నీరయ్యారు. మంగళవారం పోలీసులు పాపను వారికి అప్పగించడంతో ఆనందంలో మునిపోయారు. కిడ్నాప్ అయిన పాపను గుర్తించి అప్పగించిన పోలీసులకు వారు కృతజ్ఞతలు తెలిపారు.






## దేశానికి రోల్ మోడల్‌గా కొండపర్తి.. 3

- రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ



## నియోజకవర్గ అభివృద్ధికి చిత్తశుద్ధితో పనిచేస్తున్నా 4

- స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం




## 25 శాతం రాయితీని సద్వినియోగించుకోవాలి 2

- అడిషనల్ కలెక్టర్ పింకేష్ కుమార్

General News



# సీఎం పర్యటనను సక్సెస్ చేయాలి

- అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి
- అధికారులందరూ సమన్వయంతో పనిచేయాలి
- జనగామ కలెక్టర్ రిజ్వాన్ బాషా

**జనగామ, మన చౌరాస్తా :** ఈ నెల 16న స్టేషన్‌ఘన్‌పూర్‌లో జరిగే సీఎం రేవంత్‌రెడ్డి పర్యటనను సక్సెస్ చేసేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని జనగామ కలెక్టర్ రిజ్వాన్ బాషా ఆదేశించారు. సీఎం పర్యటన నేపథ్యంలో మంగళవారం స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, అదనపు కలెక్టర్లు పింకేష్ కుమార్, రోహిత్ సింగ్, డీసీపీ రాజ మహేంద్ర నాయక్, ఆర్డీఓలు, జిల్లా అధికారులు, తహసీల్దార్లు, సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 14వ తేదీ వరకు సంబంధిత పనులన్నింటినీ వేగవంతం చేసి, పూర్తిచేయాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. ఈ మేరకు ఎక్కడా కూడా రూట్ల వారీగా, పార్కింగ్, రాకపోకలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని పోలీస్ అధికారులకు సూచించారు. అలాగే సభా స్థలి వద్ద మహిళా పోలీస్ సిబ్బందిని ఎక్కువ మొత్తంలో నియమించాలన్నారు. పార్కింగ్ వద్ద, సభా స్థలికి కొంచెం దూరంలో తాగునీటి వసతి, తాత్కాలిక మూత్రశాలలను కచ్చితంగా ఏర్పాటు చేయాలని సూచించారు. శంకుస్థాపనలు చేసే చోట షామియానా, తదితర మౌలిక సదుపాయాలను కల్పించాలన్నారు. అదే విధంగా రూట్ మ్యాప్స్ ఆధారంగా సూచిక బోర్డులను నిర్వహించాలని తెలిపారు. ఎటువంటి తప్పిదాలకు ఆస్కారం ఇవ్వకుండా అధికారులందరూ సమన్వయంతో పనిచేస్తూ ఈ సీఎం సభ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో ఆర్డీఓ వెంకన్న, ఘనపూర్ (స్టేషన్) మునిసిపల్ కమిషనర్ రవీందర్, ఏసీపీ భీం శర్మ, పీడీ డిఆర్డిఓ వసంత, డిఎంహెచ్ఓ మల్లికార్జున రావు, డిపిఓ స్వరూప, హౌసింగ్ పీడీ మాతృ నాయక్, విద్యుత్ ఎస్ఈ వేణుమాధవ్ వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# ఎండిన పంటలకు పరిహారం ఇవ్వాలి




**చేర్యాల, మన చౌరాస్తా :** సాగునీరు అందక ఎండిపోయిన పంటలకు ఎకరాని రూ.20 వేల చొప్పున పంట నష్టపరిహారం రైతులకు అందించాలని యువజన నాయకులు నిమ్మ నిఖిల్ రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన ఇక్కడ మాట్లాడుతూ.. ఎండిపోయిన పంట పొలాల రైతంగానికి నష్ట పరిహారం అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. వర్షా కాలంలో పంటలు సాగు చేసిన రైతులకు యాసంగి పంటకు అవసరమైన సాగునీరు అందిస్తామని ప్రకటనలు చేశారని, ఇక నీళ్లు వస్తాయని ప్రచారం చేయడంతో రైతులు గంపెడంత ఆశతో పంటలు సాగుచేసుకున్నారని అన్నారు. తీరా సమయానికి ఒక్క చుక్క నీళ్ల అందించడం లేదని, నీళ్లు లేక పంటలు ఎండిపోతుంటే రైతులు కన్నీటి పర్వతమవుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సాగునీటి ఇబ్బందులు ఉండవని చెప్పిన నాయకులు ఇప్పుడు యాసంగికి నీళ్లు ఇవ్వడం లేదని పేర్కొన్నారు. విద్యుత్ సరఫరా అంతంతమాత్రంగానే ఉందన్నారు. రైతు ప్రభుత్వం అని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవసాయాన్ని నిర్లక్ష్యం చేస్తుందని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రైతులకు నష్టపరిహారం అందించి ఆదుకోవాలని ఆయన కోరారు.

## ఎల్ఆర్ఎస్ క్రమబద్ధీకరణ

# ప్రక్రియ పరిశీలన

- 25 శాతం రాయితీని సద్వినియోగించుకోవాలి
- అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్

**జనగామ, మన చౌరాస్తా :** బచ్చన్నపేట మండలంలోని ఎంపిడిఓ కార్యాలయం, పోచన్నపేట పంచాయతీ కార్యాలయం, అలాగే జనగామ మున్సిపల్ కార్యాలయంలో నిర్వహిస్తోన్న ఎల్ఆర్ఎస్ దరఖాస్తుదారుల క్రమబద్ధీకరణ ప్రక్రియను జిల్లా అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎల్ఆర్ఎస్ దరఖాస్తుదారుల ప్లాట్ల క్రమబద్ధీకరణ ఆన్‌లైన్ విధానాన్ని నిశితంగా పర్యవేక్షించి, సంబంధిత వివరాలను అడిగి తెలుసుకొని, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఎల్ఆర్ఎస్ పథకం కింద దరఖాస్తు చేసుకున్న వారు పూర్తి స్థాయి రుసుమును చెల్లించి ప్లాట్ల క్రమబద్ధీకరణ చేసుకోవాలని, ఈ నెల 31లోపు ఎల్ఆర్ఎస్ రుసుముతో పాటు బహిరంగ స్థలం ఛార్జీలను చెల్లించే వారికి ప్రభుత్వం 25 శాతం రాయితీని వర్తింపజేస్తోందని, ఈ అవకాశాన్ని దరఖాస్తుదారులు వినియోగించుకొని లబ్ధి పొందాలని తెలిపారు. అదనపు కలెక్టర్ వెంట మునిసిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, డీపీఓ స్వరూప, డీఏఓ రామారావు నాయక్, అధికారులు ఉన్నారు.





# ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు

**పరీక్షలను పర్యవేక్షించిన కలెక్టర్ రిజ్వాన్ బాషా**

**జనగామ, మన చౌరాస్తా :** ఇంటర్ పరీక్షలు ప్రశాంత వాతావరణంలో జరుగుతున్నాయని కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ తెలిపారు. మంగళవారం జిల్లా కేంద్రంలో గల ఏబీవీ కళాశాలలో జరుగుతున్న ఇంటర్ పరీక్షల తీరును పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ప్రతి రూమ్ కు వెళ్లి పరీక్షల నిర్వహణను చెక్ చేశారు. విద్యార్థులు ఎలాంటి ఒత్తిడికి గురికాకుండా ప్రశాంతంగా పరీక్ష రాయలన్నారు. పరీక్షకు ఎంత మంది విద్యార్థులు హాజరయ్యారని సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. పరీక్ష కేంద్రంలో సీసీ కెమెరాలు, తాగునీటి వసతి, మెడికల్ సిబ్బందితో ఏర్పాటు చేసిన ఆరోగ్య శిబిరంలో మందులను తనిఖీ చేశారు. ఎటువంటి పొరపాట్లకు తావులేకుండా పరీక్షలను సజావుగా నిర్వహించాలని, పరీక్ష పూర్తయిన వెంటనే జవాబు పత్రాలను పోలీస్ బందోబస్తు మధ్య నిర్దేశిత ప్రాంతాలకు తరలించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట జిల్లా ఇంటర్మీడియట్ అధికారి జితేందర్ రెడ్డి, ఇతర సంబంధిత అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# గ్రూప్ 2లో స్టేట్ 8వ ర్యాంక్ సాధించిన రాజశేఖర్ రెడ్డి



**బచ్చన్నపేట, మన చౌరాస్తా :** బచ్చన్నపేట మండల కేంద్రానికి చెందిన చిమ్ముల రాజశేఖర్ రెడ్డి గ్రూప్ 2 లో 467 మార్కులు సారించారు. మంగళవారం వెలువడిన గ్రూప్ 2 ఫలితాల్లో రాష్ట్ర 8వ ర్యాంక్ సాధించారు. రాజశేఖర్ రెడ్డి తల్లిదండ్రులు అరుణ, మల్లారెడ్డి గ్రామంలో వ్యవసాయం చేసుకుంటూ కుమారుడిని చదివించారు. గ్రూప్ 2 ఫలితాల్లో ఆయన మంచి ర్యాంకు సాధించడంతో వారు సంతోషం వ్యక్తం చేశారు.



# 'గరిమెళ్ల'కు ఘన నివాళి

**నల్లగొండ, మన చౌరాస్తా :** శ్రీమాన్ గరిమెళ్ల బాలకృష్ణ ప్రసాద్ ఆకస్మిక మరణం విచారకరమని అన్నమయ్య కళా సమితి నకిరేకల్ అధ్యక్షురాలు గండేపల్లి సుమలత అన్నారు. అన్నమయ్య కళాసమితి నకిరేకల్ వారి ఆధ్వర్యంలో ఆచలగురు మందిరంలో ఏర్పాటు చేసిన సంతాప సభలో గరిమెళ్లకు ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆచలగురు మందిరం అధ్యక్షుడు మధుసూదన్, గుండ అరుణ, అనసూయ, దనమ్మ, దయానంద్, సుకన్య, ఆంజనేయులు, రాణి, పద్మ, నిర్మల, రమ, జయ, కృష్ణమూర్తి, లక్ష్మమ్మ తదితరులు పాల్గొన్నారు.



# దేశానికి రోల్ మోడల్‌గా కొండపర్తి

- రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ
- ములుగులో పలు అభివృద్ధి పనులు ప్రారంభం

**ములుగు, మన చౌరాస్తా :** దేశానికి రోల్ మోడల్‌గా తాడ్వాయి మండలం కొండపర్తిని నిలపాలని రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ అన్నారు. మంగళవారం ఎస్ ఎస్ తాడ్వాయి మండలం కొండపర్తి గ్రామంలో రాష్ట్ర గవర్నర్ పర్యటించారు. తొలుత కొమరం భీం, బిర్సాముండ విగ్రహాలను, పాఠశాలలో డిజిటల్ తరగతులను, అంగన్వాడీ కేంద్రాన్ని, రూ.7. 84 లక్షల వ్యయంతో నిర్మించిన మసాలా యూనిట్, రూ7.76 లక్షల వ్యయంతో కుట్టు మిషన్ యూనిట్ ను ప్రారంభించారు. అనంతరం రిమోట్ తో వ్యవసాయ మోటార్లు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో గవర్నర్ మాట్లాడుతూ ఈ గ్రామంలో 70 గృహాలు 285 మంది ప్రజలు ఉన్నారని, చిన్న గ్రామమని అభివృద్ధిలో ఆదర్శంగా నిలవాలని ఆయన పేర్కొన్నారు. సమాజాభివృద్ధికి మన సేవలు ఎంతో అవసరం పేర్కొన్నారు. అటవీ ప్రాంతంలో ఉన్న ఈ గ్రామంలో డిజిటల్ తరగతులు ప్రారంభించుకోవడం ఎంతో సంతోషమని ఆయన అభినందించారు. విద్యార్థులు ఇంగ్లీషు బాగా మాట్లాడుతున్నారని ఆయన తెలిపారు. కొండపర్తిలో మహిళల ఆర్థికాభివృద్ధికి చిన్న చిన్న పరిశ్రమలు ఏర్పాటు ఆవశ్యకత ఉందని తెలిపారు. స్వయం ఉపాధి యూనిట్ల ద్వారా ఆర్థికాభివృద్ధి సాధన జరుగుతుందని తెలిపారు. గుజరాత్ రాష్ట్రంలో అమూల్ ఏ విధంగా ప్రసిద్ధిగాంచిందో అదే తరహాలో కొండపర్తి గ్రామం కారం, పసుపు, మసాలా, యూనిట్లకు అంతటి పేరు ప్రఖ్యాతలు సాధించాలని ఆయన ఆకాంక్షించారు. ఈ ప్రాంతంలో మిర్చి సాగు బాగుందని మిర్చి పౌడర్ కు మంచి ఇమేజ్ రావాలని ఆయన పేర్కొన్నారు. తెలంగాణ వ్యాప్తంగా మిర్చి పౌడర్ బాగా ఫేమస్ కావాలని ఆయన సూచించారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ వికసిత్ భారత్ సంకల్పానికి ఈ గ్రామం ఆదర్శంగా నిలవాలని పిలుపు పిలుపునిచ్చారు. మారుమూల ప్రాంతమైన కొండపర్తి గ్రామాన్ని తాను దత్తత తీసుకున్నానని, ఈ గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తయారు చేసేందుకు ఆదివాసి మారుమూల గ్రామాల్లో పర్యటిస్తున్నట్లు తెలిపారు. తాను రాష్ట్రం లో ఏడు ఆదివాసి గ్రామాలను దత్తత తీసుకున్నానని, అన్ని గ్రామాలను అభివృద్ధిలో ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దుటకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. గ్రామంలో కోటి 50 లక్షల రూపాయలతో వివిధ అభివృద్ధి పనులు ప్రారంభించినట్లు తెలిపారు. ఆదివాసీల



అభివృద్ధికి తాను, రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం కృషి చేస్తున్నట్లు తెలిపారు. చిన్న పరిశ్రమలు ఏర్పాటు ద్వారా ఆదాయం సమకూరుతుందని తద్వారా అదివాసులు ఆర్థికాభివృద్ధి సాధిస్తారని పేర్కొన్నారు. తాను, రాష్ట్రపతి, రాష్ట్ర మంత్రి సీతక్క అందరు ఆదివాసి బిడ్డలమని ఆయన పేర్కొన్నారు. దేశానికి కొండపర్తి గ్రామం మోడల్‌గా కావాలని పేర్కొన్నారు. ముందుగా మంత్రి సీతక్క, జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్, ఎస్పీ శబరీష్, గ్రామస్తులు తదితరులు గవర్నర్ ను ఘనంగా సన్మానించి మెమోంటో అంద చేశారు. రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క మాట్లాడుతూ ఈ ప్రాంత అభివృద్ధికి జిల్లా కలెక్టర్, జిల్లా యంత్రాంగం సేవలను అభినందించారు. దట్టమైన అడవిలో ఉన్న ప్రాంతమని రవాణా సౌకర్యం కూడా లేని గ్రామాన్ని గవర్నర్ దత్తత తీసుకున్నట్లు తెలిపారు. ఈ గ్రామాన్ని బయట ప్రపంచంతో అనుసంధానం చేస్తూ ఉత్పత్తులను అందించాలని, తద్వారా మహిళలు వ్యాపారవేత్తలుగా ఎదగాలని తెలిపారు. మహిళలు ఆర్థికాభివృద్ధి సాధనలో కొండపర్తి గ్రామం రోల్ మోడల్ కావాలని ఆమె సూచించారు. ఈ గ్రామానికి అనతి కాలంలోనే రహదారి సౌకర్యం ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

కార్యక్రమంలో గవర్నర్ కార్యాలయ ప్రధాన కార్యదర్శి దాన కిషోర్, ఐటిడిఏ పీఓ చిత్ర మిశ్రా, జిల్లా అటవీశాఖ అధికారి రాహుల్ కిషన్ జాదవ్, గవర్నర్ కార్యాలయ సంయుక్త కార్యదర్శి భవాని శంకర్, గవర్నర్ ఏడిసి మేజర్ అమన్ కుండు, గవర్నర్ సిఎస్ఓ శ్రీనివాస రావు, గ్రంథాలయ కమిటీ చైర్మన్ రవి చందర్, గ్రామ పెద్దలు లచ్చు పటేల్ తదితరులు పాల్గొన్నారు.

















## నియోజకవర్గ అభివృద్ధికి

# చిత్తశుద్ధితో పని చేస్తున్నా..

- ఇచ్చిన హామీలను వంద శాతం నెరవేరుస్తా..
- జఫర్ గడ్‌లోని అన్నిగ్రామాలకు గోదావరి జలాలు తీసుకువస్తా..
- 16న సీఎంతో రూ.800 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన
- స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి




**స్టేషన్‌ఘన్‌పూర్, మన చౌరాస్తా :** 16న నిర్వహించే భారీ బహిరంగ సభ స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ దిశను మార్చే సభ, అభివృద్ధికి దోహదం చేసే సభ అని నియోజకవర్గ ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి సభను జయప్రదం చేయాలని మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి పిలుపునిచ్చారు. జఫర్ గడ్ మండల కేంద్రంలో జఫర్ గడ్ మండల కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలతో ఎమ్మెల్యే కడియం శ్రీహరి విస్తృత స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో నియోజకవర్గప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చందుకు, నియోజకవర్గ అభివృద్ధికి చిత్తశుద్ధితో పని చేస్తున్నానని స్పష్టం చేశారు. నియోజకవర్గంలోని ప్రతీ ఎకరాకు సాగు నీరు, ప్రతీ గ్రామంలో ఇందిరమ్మ ఇల్లు, ప్రతీ గ్రామానికి బీటిరోడ్లతో పాటు అనేక అభివృద్ధి పనులను చేయాలనే లక్ష్యంతో నిరంతరం కృషి చేస్తున్నట్లు వెల్లడించారు. ఒక్క ఏడాదిలోనే నియోజకవర్గ అభివృద్ధికి రూ.800 కోట్లపైగా నిధులు తీసుకువచ్చానని తెలిపారు. ఈ 800కోట్ల అభివృద్ధి పనుల శంకుస్థాపన చేయడానికి ఈ నెల 16న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గానికి వస్తున్నారని తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధికి పెద్ద పీట వేసి అత్యధిక నిధులు మంజూరు చేసిన సీఎం రేవంత్ రెడ్డికి మనందరం ఘన స్వాగతం పలకాలని పిలుపునిచ్చారు. బహిరంగ సభకు భారీ జన సమీకరణ చేసి నియోజకవర్గంలో మన బలంఏంటో చూపించాలని అన్నారు. ఇంకా 4 రోజుల సమయం మాత్రమే ఉందని, ఏ గ్రామంలోని నాయకులు ఆ గ్రామంలో మహిళలు, రైతులను పెద్ద సంఖ్యలో తరలించేందుకు ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. ఈ సభ మన నియోజకవర్గ దిశను మార్చే సభ అన్నారు. ప్రతీ కాంగ్రెస్ కార్యకర్త ముందుండి బహిరంగ సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## గిరిజన జర్నలిస్టులకు

# సంక్షేమ పథకాలను అందించాలి

**పాలకుర్తి, మన చౌరాస్తా :** మీడియా రంగంలో పనిచేస్తున్న గిరిజన జర్నలిస్టులకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను అందించాలని టీడబ్ల్యూజేఏ రాష్ట్ర అధ్యక్షుడు బానోతు వెంకన్న నాయక్ ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం మండల కేంద్రంలో గిరిజన జర్నలిస్టుల సమావేశాన్ని ఏర్పాటు చేసి సభ్యత్వ నమోదు పత్రాలను చేశారు. రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యులు లావుడియా రాజుతో కలిసి వెంకన్న నాయక్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో పని చేస్తున్న గిరిజన జర్నలిస్ట్ లు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. గిరిజన జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించేందుకు, గిరిజన జర్నలిస్టులకు శిక్షణ ఇచ్చేందుకు ఐటీడీఏ, ప్రెస్ అకాడమీ సంయుక్తంగా కృషి చేయాలని అన్నారు. గిరిజన జర్నలిస్టులకు ఎలాంటి షరతులు లేకుండా ఐటీడీఏ రుణాలను మంజూరు చేసి జర్నలిస్టు కుటుంబాలను ఆదుకోవాలని కోరారు. గిరిజన జర్నలిస్టులకు స్వయం ఉపాధి కల్పించుకునేందుకు ప్రభుత్వం ప్రోత్సహించాలని, సమస్యలను పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టాలని అన్నారు. గిరిజన జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం, భవిష్యత్తు కార్యాచరణను రూపొందించేందుకు గిరిజన జర్నలిస్టులకు సభ్యత్వ నమోదు తో పాటు జిల్లా, రాష్ట్ర మహాసభలను నిర్వహించి కమిటీలను ఎన్నుకుంటామని తెలిపారు. సభ్యత్వం పొందిన గిరిజన జర్నలిస్టులకు ప్రమాద బీమా సౌకర్యాన్ని కల్పిస్తున్నామని అన్నారు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకునేందుకు గిరిజన జర్నలిస్టులు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టీయూడబ్ల్యూజేఏ జిల్లా అధ్యక్షుడు ధారావత్ అశోక్ నాయక్, నాయకులు శ్రీను నాయక్, జి.దేవోజి , రాజు నాయక్ తదితరులు పాల్గొన్నారు.




'మన చౌరాస్తా' తెలుగు దిన పత్రికలో పనిచేసేందుకు జిల్లా స్టాఫర్లు, కంట్రీబ్యూటర్లు కావలెను. తెలుగు భాషపై పూర్తి స్థాయిలో పట్టు.. సమకాలీన రాజకీయాలు, సామాజిక అంశాలపై అవగాహన ఉండి.. రాయగల వారికి 'మన చౌరాస్తా' సాదర స్వాగతం పలుకుతోంది.

సెల్ : 9676400812